క్లుప్తంగా

విద్యాబోధనపై శ్రద్ధ అవసరం



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ వెంకటరమణ

వీరవాసరం: విద్యా బోధనపై ఉపాధ్యాయులంతా ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటరమణ తెలిపారు. రాయకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ఉపయోగించి విద్యా బోధన చేయాలని సూచించారు. పాఠశాలలో జరుగుతున్న నిర్మాణ పనులను ప్రత్యేకంగా పరిశీలించారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట మండల విద్యాశాఖ అధికారి శ్రీమన్నారాయణ, హెచ్ఎం కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సాక్షి, భీమవరం: పట్టణంలో 33 కేవీ టిడ్కో ఫీడర్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు నరుకుతున్నందున బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎంప్లాయిస్ కాలనీ, టిడ్కో ఇళ్లకు, గాం. దీనగరం ఏరియాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని అహ్మద్ ఖాన్ కోరారు.

నీట మునిగిన పొలాల పరిశీలన



నీట మునిగిన వరిచేలను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

ఆకివీడు: భారీ వర్షాలు, వరదలకు నీట మునిగిన వరి చేలలలో నీటిని బయటకు తోడించే చర్యలు చేపట్టాలని కేవీకే శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని గుమ్ములూరు, చెరుకుమిల్లి గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్తలు మల్లిఖార్జున రావు, దెబోరా మెస్సియానా, మార్టేరు శాస్త్రవేత్త సతీష్ మాట్లాడుతూ ముంపు నీరు బయటకు వెళ్లిన తరువాత చేలల్లో హెక్సాకొనజోల్ 2ఎంఎల్, ప్రొపికోజోల్ ఒక ఎంఎల్, లేదా కార్బెండజిమ్ 1 గ్రామ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాస్, ఏఓ ప్రియాంక రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

సాక్షి, భీమవరం: హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం భీమవరం మున్సిపాలిటీ ఆఫీస్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జేఎన్వి గోపాలన్ మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. బి.వాసుదేవ రావు, బంగారు వరలక్ష్మి, నీలాపు రాజు, నిమ్మకాయల ధనలక్ష్మి పాల్గొన్నారు.

తమ్ముడిపై బీరుసీసాతో దాడి చేసిన అన్న

సాక్షి, భీమవరం: పాతగొడవల నేపథ్యంలో తమ్ముడిని అన్న బీరుసీసాతో గాయపర్చిన ఘటన భీమవరం పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారాం పట్టణంలో బుధవారం మార్కెట్ ప్రాంతానికి చెందిన గెడ్డం ఏసు అతని అన్న నాగరాజు మధ్య పాత గొడవలున్నాయి. దీంతో సోమవారం రాత్రి ఇంటివద్ద పడుకున్న ఏసును అతని అన్న నాగరాజు బీరుసీసాతో గాయపర్చాడు. దీంతో బాధితుడి భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చిక్సిత్స పొందుతున్నాడు. దీనిపై మంగళవారం ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భీమవరం వన్‌టౌన్ ఏఎస్సై కె. దేవరాజ్ తెలిపారు.

మావుళ్లమ్మ ఆలయంలో చండీ హోమం

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ , దేవస్థాన వేద పండితులు కలిసి సంప్రదాయబద్ధంగా చండీ హోమం నిర్వహించారు . అలాగే అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాలకొల్లులో...

పాలకొల్లు అర్బన్: పంచారామ క్షేత్రంగా ప్రసిద్ధిచెందిన శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం చండీహోమం నిర్వహించారు. పట్టణానికి చెందిన 22 మంది దంపతులు ఆలయ అభిషేక పండితులు బ్రహ్మశ్రీ భమిడిపాటి వెంకన్న బ్రహ్మత్వంలో చండీహోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆదేశించారు. మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మున్సిపల్, ఆర్ అండ్ బి శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజవర్గంలో పలు శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని, వాటిని మరింత వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ముఖ్యంగా పట్టణంలో మున్సిపల్ నిధులతో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, దీనిలో భాగంగా సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలను చేపట్టామని అన్నారు. పట్టణంలో మరికొన్ని అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు కూడా పంపామని, వాటికి త్వరలోనే ప్రభుత్వం నుంచి ఆమోదం వస్తుందన్నారు. ఈ సమీక్షలో మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ సుధాకర్, ఎంఈ త్రినాథరావు, టౌన్ ప్లానింగ్ ఏసీపీ గౌరు, ఆర్అండ్‌బీ శాఖ ఈఈ లోకేశ్వర రావు, డీఈ రామరాజు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ పరిశీలన

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని బుధవారం మార్కెట్లో రూ.5.58 కోట్లతో నిర్మించిన విద్యుత్ జీఐఎస్ సబ్ స్టేషన్ ను మంగళవారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సబ్ స్టేషన్ వల్ల పట్టణ ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తీరతాయన్నారు. 244 గజాల స్థలంలో భీమవరం మెయిన్ సెంటర్లో ఈ విద్యుత్ సబ్ స్టేషన్ ను నిర్మించడానికి ప్రభుత్వం రూ.5.58 కోట్లు నిధులను మంజూరు చేయడం, నిర్మాణ పనులు వెంటనే పూర్తయ్యాయన్నారు. త్వరలోనే ఈ సబ్ స్టేషన్ ను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీఏ రాజగోపాల్ చౌదరి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, జెసిఎస్ కన్వీనర్ చెల్లబోయిన సూర్య ప్రకాష్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ గౌరు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్

సాక్షి, భీమవరం: భీమవరం ఆర్టీసీ డిపో రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ నూతన కమిటీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను మంగళవారం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసింది. ఇటీవల జరిగిన అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ సందర్భంగా నూతన కమిటీకి గతంలో మాదిరిగానే సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎస్ రావు, కె.నర్సింహరాజు, ఉపాధ్యక్షుడు జి.అబ్రహం తదితరులున్నారు.

నారాయణ కళాశాల వద్ద ఏబీవీపీ ఆందోళన



ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

సాక్షి, భీమవరం: ఫీజులు చెల్లించని విద్యార్థులను తరగతి గదుల బయట కూర్చోబెట్టి అవమానించడం దారుణమని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) భీమవరం శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. పట్టణంలోని నారాయణ కళాశాలలో ఫీజులు కట్టలేదని విద్యార్థులను తరగతులకు పంపకుండా సెల్లార్‌లో కూర్చోబెట్టడాన్ని నిరసిస్తూ మంగళవారం కళాశాల వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కాయిత డిన్ను చందు మాట్లాడుతూ ఫీజులు కట్టలేదనే నెపంతో విద్యార్థులను తరగతులకు పంపకుండా మానసికంగా వేదించడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు డి చాందిని, దేవేంద్ర, జగదీష్, తేజ, పవన్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానం



తల్లిపాల అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): తల్లిపాలే అమృతమని, నవజాత శిశువు ఆరోగ్యంగా పెరగడానికి తల్లిపాలు ఎంతగానో దో హదపడతాయని డిఎంహెచ్ఓ డి మహేశ్వరరావు అన్నారు. శ్రీ విజ్ఞానవేదిక, ప్రభుత్వ వైద్య శాఖ ఆధ్వర్యంలో భీమవరం లూథరన్ కళాశాలలో ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలను ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్ఓ మహేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతి సిద్ధంగా లభించే పాలు బిడ్డకు ఎంతో మేలు చేస్తాయని, బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వాలని అన్నారు. బిడ్డ శారీరక మానసిక ఎదుగుదలకు అవసరమైన కొవ్వులు, పిండి పదార్థాలు, ప్రోటీన్లు, విటమిన్లు వంటి పోషకాలన్నీ తల్లిపాలలో సమతూకంలో ఉంటాయని, కాన్పు తర్వాత మొదటి రెండు మూడు రోజుల్లో వచ్చే ముర్రుపాలు చాలా ముఖ్యమని, ఇవి ఒక రకంగా తొలి టీకా లాంటివని అన్నారు. ఆరోగ్య కార్యకర్తలు అప్పుడేపుట్టిన శిశువుకు నీరు, గ్లూకోజు నీరు, తేనెలాంటి పదార్థాలు తాగించొద్దని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన తరువాత మొదటి ఆరు నెలలు కూడా బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలను మించిన ఆహారం మరొకటి లేదన్నారు. ఈ నెల 7వ తేదీ వరకు ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలను అవగాహనా ప్రచార కార్యక్రమాలను తెలిపారు. అనంతరం ఆశ వర్కర్స్, హెల్త్ సూపర్ వైజర్స్ ఏఎస్ఎం, మెడికల్ ఆఫీసర్లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్ఎంవో డాక్టర్ సుగుణ రాజు, ఎస్ఓ సర్వేశ్వర ప్రసాద్, పి.భాస్కరరావు పాల్గొన్నారు.

భీమవరంలో క్రైస్తవుల భారీ ర్యాలీ



భీమవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్నదాడులకు నిరసనగా భీమవరంలో మంగళవారం బైబిల్‌మిషన్, లూథరన్, యూపీఏ తదితర క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో భారీ శాంతియుత నిరసన ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని లూథరన్ హైస్కూల్ వద్ద ప్రారంభమైన ర్యాలీ ఆంధ్రాబ్యాంక్, ఆదివారం బజార్, లక్ష్మీ టాకీస్ సెంటర్, రూపాంతర దేవాలయం, ప్రకాశంచౌక్ మీదుగా అంబేడంకర్ సెంటర్‌కు చేరుకుంది. ఈసందర్భంగా ఏపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ మేడిది జాన్సన్ మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడుల అమానుషమన్నారు. కార్యక్రమంలో డేగల వర్గీస్‌డేనియల్, పట్టా దేవరాజు, జొన్నలగడ్డ శామ్యూల్, వినుకొండ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు

సాక్షి, భీమవరం: మణిపూర్‌లో గిరిజన క్రైస్తవులపై జరిగిన దాడి, దౌర్జన్యాలకు గురైన బాధితులు త్వరగా కోలుకోవాలని భీమవరం పట్టణంలోని రాజ్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాజ్‌ట్రస్ట్ అధ్యక్షుడు గంటా రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థన కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ మాట్లాడుతూ మణిపూర్ బాధితులకు కేంద్రప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో పాలవర్తి జోనా, కేసీ రాజు, మరపట్ల మునియ్య, జీడీ కరుణాకర్, ఎస్ మహేష్, గొల్లా రాజ్‌కుమార్, దాసరి సతీష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష



జగనన్న సురక్ష పథకంలో ధ్రువపత్రాలు పొందిన లబ్ధిదారులు

ఆకివీడు: జాప్యం, అవినీతి, సమయ వృధా వంటి వాటికి చెక్ పెడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి అమలు జరిపిన జగనన్న సురక్ష పథకం ఉండి నియోజకవర్గంలో రికార్డు సృష్టించింది. ప్రతీ ఇంట్లో లబ్ధి పొందే విధంగా సురక్ష కార్యక్రమాల్ని వలంటీర్లు పారదర్శకంగా నిర్వహించారు. విద్యార్థులకు, రైతులకు, ఇతరులకు ఉపయోగపడే విధంగా జగనన్న సురక్ష పథకం ద్వారా ధ్రువపత్రాల్ని అందజేశారు. ఇంటింటికీ వెళ్లి వలంటీర్లు ప్రజా అవసరాల్ని అడిగి తెలుసుకున్నారు. జూలై 1న ప్రా రంభించిన కార్యక్రమం ఆగస్టు 1 నాటికి విజయవంతంగా ముగించారు. పింఛన్ అందలేని వృద్ధులకు పింఛన్ సౌకర్యం కల్పించడంతో పాటు, రైతులకు 1బీ ఫారంలు అందజేసే విధంగా, కౌలు ధ్రువపత్రా లు, ఆదాయ, కుల ధ్రువపత్రాల్ని నియోజకవర్గంలో 97,479 మందికి అందజేశారు. వలంటీర్లు, గృహా సారధులు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు ఉద్యమంలా కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

ఉండిలో అత్యధికం

ఉండి నియోజకవర్గంలో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ధ్రువపత్రాల్ని అత్యధికంగా ఉండి మండలంలో పంపిణీ చేశారు. 22,530 గృహాలను సర్వే చేయగా 32,318 మందికి ధ్రువపత్రాల్నీ అందజేశారు. ఆకివీడు నగర పంచాయతీ పరిధిలో 3,214 మందికి ధ్రువపత్రాల్ని అందజేశారు. గతంలో ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థులు కాలేజీలు మాని రోజుల తరబడి తిరిగేగానీ వచ్చేవి కావు. కానీ ప్రస్తుతం ఇంటికే పత్రాలను అందిచడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సురక్షతో ప్రజలకు మేలు



ఉండి మండలంలో జగనన్న సురక్ష ద్వారా ఫ్యామిలీ సర్టిఫికెట్ అందజేశాం. గతంలో ఆర్డీవో కార్యాలయం వద్దకు వెళ్లి తెచ్చుకోవలసి వచ్చేది. ప్రభుత్వం నిర్దేశించిన ఆరు అంశాలతో నవశకం పథకంలో సురక్ష ద్వారా పాలన మరింత ప్రజలకు చేరువైంది. మండలంలో 32,318 మందికి ధ్రువపత్రాలు అందజేశాం.

– అదబాల వెంకట అప్పారావు, ఎంపీడీఓ, ఉండి మండలం

ఉండి నియోజకవర్గంలో జగనన్న సురక్ష ధ్రువపత్రాలు

మండలం	మొత్తం గృహాలు	సర్వే పూర్తి	లబ్ధిదారులు
ఆకివీడు	14,478	13,662	13,861
ఆకివీడు పట్టణం	16,692	10,301	3,214
ఉండి	22,630	22,530	32,318
కాళ్ల	24,327	24,027	24,327
పాలకోడేరు	24,878	21,068	23,759
మొత్తం	1,03,005	91,588	97,479

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- ఏలూరుపాడులో గడపగడపకు మన ప్రభుత్వం



ఏలూరుపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

కాళ్ల: రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దక్కుతుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు తెలిపారు. కాళ్ల మండలం ఏలూరుపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం రెండవ రోజు నిర్వహించారు. సంక్షేమ పథకాలు పొందుతూ ఆనందంగా ఉన్న మహిళలంతా పీవీఎల్ నరసింహారాజుకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కుటుంబాల వారిగా అందుతున్న సంక్షేమాన్ని వారికి వివరించి సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నియోజకవర్గంలో సంక్షేమ పథకాలతో ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారని అన్నారు. ప్రజల ఆదరణ చూస్తుంటే మళ్లీ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని తెలిపారు. ఏలూరుపాడు గ్రామం అంటే టీడీపీకి కంచుకోటలాగా చెప్పుకుంటారని, కానీ ప్రజల ఆశీస్సులను చూస్తుంటే మార్పు మొదలైనట్లు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో ఉండి నియోజకవర్గంలో వైసీపీ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. ఏలూరుపాడులో సుమారు రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు గుర్తు చేశారు. నాడు నేడు పథకంలో పాఠశాలలు, సీసీ రహదారులు, సీసీ డ్రైనేజీలు, నిర్మించి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూపతిరాజు జగ్గరాజు, జెడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, ఎంపీపీ పెన్మెత్స విశ్వనాథరాజు, ఎంపీటీసీ చిన్నాపరపు రాంబాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాసరాజు, మంతెన రామకృష్ణా రాజు, దాట్ల బాపిరాజు, రుద్రరాజు రామకృష్ణంరాజు, కటారి లక్ష్మీపతి రాజు, గుండు నాగేశ్వరరావు, బంద్రెడ్డి ఆది, పడమట సుబ్బయ్య, పడమట సతీష్, దాట్ల రామభద్రిరాజు, కొండా రమణ , కోనా రంజిత్ , సీహెచ్ అశోక్ జెమ్స్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, అభిమానులు పాల్గొన్నారు.

సుదూర ప్రాంతాలకు వెళ్లి..



పెన్నాడ అగ్రహారం వెళ్లి సన్న మంద్ర దానియేలుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కాంద్రేగుల గణేష్

పాలకోడేరు: పాలకోడేరు గ్రామానికి చెందిన సన్నమంద్ర దానియేలు 70 ఏళ్ల వృద్ధుడు. ఈయన ప్రతినెల వృద్ధాప్య పింఛన్ తీసుకుంటున్నాడు. ఇటీవల కాలంలో రాజమండ్రిలో బ్యాక్ బోన్‌కు ఆపరేషన్ చేయించుకుని పెన్నాడ అగ్రహారంలో కుమారుడు ఇంటి వద్దనే ఉంటున్నాడు. లేవలేని పరిస్థితితో ఉండడంతో గమనించిన వలంటీర్లు కాంద్రేకుల గణేష్, నార్కమిల్లి రవిలు ఇద్దరూ కలిసి పెన్నాడ అగ్రహారం వెళ్లి పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఏలూరుపాడులో గడపగడపకు మన ప్రభుత్వం

కాళ్ల: మండలంలోని ఏలూరుపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ పి.వి.ఎల్ నర్సింహరాజు మంగళవారం తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఏలూరుపాడు గ్రామంలో సచివాలయం 2 పరిధిలో మూడవ రోజు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు, పెద్దలు ,పార్టీ నాయకులు ,కార్యకర్తలు, అభిమానులు, అని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొనాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాళ్ల: చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతి చెందినట్లు కాళ్ల పోలీసులు మంగళవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాళ్ల మండలం జక్కరం గ్రామానికి చెందిన నల్లూరి ధనలక్ష్మికి ముగ్గురు సంతానం. వీరిలో చిన్నకుమారుడైన నల్లూరి శివ (30) కు ఉండి గ్రామానికి చెందిన పద్మఅనూషతో సుమారు మూడు సంవత్సరాల క్రితం వివాహమైంది. అయితే మృతుడు శివ తన సమీప బంధువుతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్నట్లు తెలుసుకున్న భార్య గొడవపడి 8నెలల క్రితం పుట్టింటికి వెళ్లి పోయింది. ఈనేపథ్యంలో కాపురం చక్కదిద్దేందుకు ఇరుపక్షాల పెద్దలు సోమవారం మధ్యాహ్నం మృతుడి ఇంటివద్ద సమావేశమయ్యారు. పెద్దలు మాట్లాడుకుంటున్న సమయంలో మృతుడు మద్యం సేవించి వచ్చి గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కి ఉరివేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు, బంధువులు వైద్యం కోసం భీమవరంలోని ఆసుపత్రికి తరలించారు. మంగళవారం మధ్యాహ్నం చికిత్స పొందుతూ శివ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఏజీఎస్ మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కాళ్ల: పని ముగించుకుని ఇంటికి మోటార్ బైక్ పై వెళ్తున్న యువకుడిని ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనపై కాళ్ల పోలీసు స్టేషన్లో మంగళవారం కేసు నమోదైంది. కాళ్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాళ్ల గ్రామానికి చెందిన పాకెర్ల కాంతరాజు సోమవారం సాయంత్రం పని ముగించుకుని భీమవరం నుంచి తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా జక్కరం గ్రామం సెంటర్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా అతి వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన కాంతరాజును 108 వాహనంలో భీమవరం పట్టణంలోని ఆసుపత్రికి తరలించగా అక్కడ నుంచి వచ్చిన స్టేట్మెంట్ మేరకు మంగళవారం కాళ్ల ఎస్సై ఏజీఎస్మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జూదరుల అరెస్టు

ఉండి: మండలంలోని యండగండిలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు.ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,800 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కే గంగాధరరావు తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

నరసాపురం రూరల్: అధిక వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు అన్నారు. మంగళవారం మండలంలోని వరదపోటుకి గురైన చిట్టవరం, చినమామిడిపల్లి, కొత్తనవరసపురం తదితర గ్రామాల్లో నీట మునిగిన నారుమడులను ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. మాధవాయిపాలెం, కాజ లాకులు శిథిలావస్థకు చేరాయని వాటికి మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

కాళ్ల: తమ కుమార్తె కనిపించడం లేదంటూ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాళ్ల పోలీసు స్టేషన్లో మంగళవారం కేసు నమోదైంది. ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మొగల్తూరుకి చెందిన వివాహిత తన ఇద్దరు పిల్లలతో కలిసి కాళ్ల మండలం పల్లిపాలెం గ్రామంలో జీవనోపాధి నిమిత్తం ఆక్వా చెరువులపై కాపలాగా ఉంటూ నివాసం ఉంటుంది. ఈతరుణంలో తమ కుమార్తె గత నెల 30 తేదీ రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదన్నారు. బాలిక తల్లి దయామణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మొగల్తూరుకి చెందిన పవన్ కుమార్ అనే యువకుడిపై అనుమానం ఉన్నట్టు ఫిర్యాదులో పేర్కొనట్లు ఎస్సై తెలిపారు

వరిసాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గిస్తే మేలు

ఉండి: వరిసాగులో రసాయ ఎరువుల వాడకాన్ని తగ్గిస్తే రైతులకు, ప్రజలకు, పర్యావరణాన్ని మంచిదని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ పీ వినయలక్ష్మీ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ మల్లిఖార్జునరావు తెలిపారు. మంగళవారం ప్రస్తుతం రైతులంతా వ్యవసాయంలో అధికంగా రసాయన ఎరువులు వాడుతున్నారని దీనివల్ల పర్యావరణానికి, భూమికి చాలా హానీ కలుగుతుందన్నారు.సాగులో మొక్క పెరుగుదలకు అవసరమైన సూక్ష్మజీవులు, హార్మోన్‌లు, పోషక పదార్థాలు వంటివి జీవన ఎరువుల ద్వారానే పంటకు లభిస్తాయన్నారు. రైతులు వరిసాగులో ఉపయోగించే జీవన ఎరువులను కేవీకేలో అందుబాటులో ఉంచామని అవసరమైన రైతులు వచ్చి శాస్త్రవేత్తలను సంప్రదించాలని సూచించారు.